క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

హుజూర్‌నగర్ : పట్టణంలోని ట్రాన్స్‌ఫార్మర్లను పాత దిమ్మెల మీద నుంచి కొత్త దిమ్మెల మీదకు మార్చుతున్నందున బుధవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని విద్యుత్ ఏఈ రాంప్రసాద్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. పట్టణంలోని లింగగిరి రోడ్, తిలక్‌నగర్, గాంధీ పార్క్, రెడ్డి బజార్, పీర్ల కొట్టం ప్రాంతాల్లో బుధవారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఆయన తెలిపారు.

రజక సంక్షేమ సంఘం పొలిట్ బ్యూరో సభ్యుడిగా శ్రీను



నేరేడుచర్ల : రజక సంక్షేమ సంఘం రాష్ట్ర పొలిట్ బ్యూరో సభ్యుడిగా నేరేడుచర్ల మండల కేంద్రానికి చెందిన చిలకరాజు శ్రీను నియమితులయ్యారు. ఈమేరకు మంగళవారం నేరేడుచర్లలో రజక సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ముప్పు భిక్షపతి, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ చేరాల ప్రకాశ్‌లు.. శ్రీనుకు నియామక పత్రం అందజేశారు. ఈ సందర్భంగా చిలకరాజు శ్రీను మాట్లాడుతూ.. రాష్ట్రంలో రజకులు ఎదుర్కొంటున్న సమస్యలపై రాజీలేని ఉద్యమాలు చేస్తానని తెలిపారు.

సీపీఐ మండల కార్యదర్శిగా మండవ వెంకటేశ్వర్లు



చిలుకూరు : సీపీఐ చిలుకూరు మండల నూతన కార్యదర్శిగా వరుసగా ఐదవ సారి నారాయణపురం గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ మండవ వెంకటేశ్వర్లు ఎన్నికయ్యారు. మంగళవారం నారాయణపురం గ్రామంలో జరిగిన పార్టీ మండల సభలో ఆయనను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. పార్టీ మండల సహాయ కార్యదర్శులుగా సాహెబ్ అలీ, కాంపాటి వెంకటయ్యతో పాటు 35 మంది కౌన్సిల్ సభ్యులు, 13 మంది కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా మండల కార్యదర్శి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. పార్టీ అభివృద్ధికి కృషి చేస్తానని తెలిపారు.

ప్రభుత్వ కళాశాలల్లో చేర్పించాలి



ప్రతిభ కనబరిచిన విద్యార్థులను సన్మానిస్తున్న ప్రభుత్వ జూనియర్ కళాశాల సిబ్బంది

నేరేడుచర్ల : తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో చేర్పించాలని నేరేడుచర్ల ప్రభుత్వ జూనియర్ కళాశాల అధ్యాపకులు కోరారు. ఈమేరకు మంగళవారం మండలంలోని కల్లూరు పెంచికల్‌దిన్న, జాన్‌పహాడ్, పానుగోడు, అప్పన్నపేట, అప్పిరెడ్డిగూడెం తదితర గ్రామాల్లో కళాశాల సిబ్బంది, విద్యార్థులు ఇంటింటికీ వెళ్లి కరపత్రాలు పంపిణీ చేశారు. నేరేడుచర్ల ప్రభుత్వ జూనియర్ కళాశాలలో చదివి ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరంలో ఉత్తమ మార్కులు సాధించిన అప్పన్నపేట గ్రామానికి చెందిన అఖిల, శ్రవంతిని ఈ సందర్భంగా సత్కరించారు. కార్యక్రమంలో కళాశాల ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ వెంకటరమణ, అధ్యాపకులు డాక్టర్ మద్దిమడుగు సైదులు, శ్రీనివాసులు, ప్రణతి, వెంకన్న, నరేందర్, సునిత, నర్సింహాచారి, గణేష్, వెన్నెల, ప్రసాద్, వీరు, అపర్ణ, వీరేష్ తదితరులు ఉన్నారు.

క్రీడా దుస్తులు పంపిణీ

నడిగూడెం : మండల కేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాలలో సమ్మర్ క్యాంపులో భాగంగా కబడ్డీ క్రీడలో ఉచితంగా శిక్షణ పొందుతున్న క్రీడాకారులకు నడిగూడెంకు చెందిన దివంగత రిటైర్డు ప్రధానోపాధ్యాయుడు ఎలక నారాయణరెడ్డి జ్ఞాపకార్థం ఆయన కుమారుడు వెంకటరెడ్డి మంగళవారం క్రీడా దుస్తులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో కోచ్ పల్లపు నాగేశ్వరరావు, నిర్వాహకులు మేరాద్దీన్, రియాజ్, ఇంతియాజ్, ప్రదీప్, తదితరులు పాల్గొన్నారు.

మహిళా కమిషన్ సభ్యురాలిగా నియమించాలి

మునగాల : తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట యోధురాలు చాకలి ఐలమ్మ కుటుంబ సభ్యులను మహిళా కమిషన్ సభ్యులుగా నియమించాలని జాతీయ బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు పానుగోటి రంగా ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. మంగళవారం మునగాల మండల కేంద్రంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గతంలో రవీంద్రభారతిలో జరిగిన ఐలమ్మ జయంతి ఉత్సవాలలో సీఎం రేవంత్‌రెడ్డి.. ఐలమ్మ వారసురాలైన చిట్యాల శ్వేతను రాష్ట్ర మహిళా కమిషన్ సభ్యురాలిగా నియమిస్తానని హామీ ఇచ్చారని, మాటిచ్చి నెలలు గడుస్తున్నా హామీ నెరవేర్చకపోవడం రజకుల మనోభావాలు దెబ్బతీయడమేనన్నారు.

ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన

చిలుకూరు : మండలంలోని కొండాపురం గ్రామంలో ప్రజలకు మంగళవారం ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎమ్‌పీడబ్ల్యూ సిబ్బందికి జీవనజ్యోతి బీమా యోజన, ప్రధాన మంత్రి సురక్ష బీమా యోజన ఇన్సూరెన్స్‌లు చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ పంచాయతీ కార్యదర్శి కార్తీక్ రెడ్డి, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

రైతు వేదికల నిర్వహణపై పట్టింపేదీ!

- రైతు వేదికల నిర్వహణకు రెండున్నర ఏళ్లుగా రాని నిధులు
- ఏఈఓలపై ఆర్థిక భారం
- రక్షణ లేక సామన్లు చోరీ
- మందుబాబులకు అడ్డాగా..



ప్రహరీ లేని నడిగూడెం రైతు వేదిక

నడిగూడెం : మండలంలోని రైతు వేదికలు వ్యవసాయ విస్తరణ అధికారులకు భారంగా మారాయి. వాటి నిర్వహణకు ప్రభుత్వం నుంచి రెండున్నర ఏళ్లుగా నిధులు రాకపోవడంతో ఏఈఓలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రైతులకు సేవలు మరింత చేరువ చేయాలని గత ప్రభుత్వం రైతు వేదికలను నిర్మించింది. నడిగూడెం మండల కేంద్రంతో పాటు, కరివిరాల, సిరిపురం, రత్నవరం గ్రామాలను క్లస్టర్‌లుగా విభజించి రైతు వేదికలను ప్రభుత్వం నిర్మించారు. నడిగూడెం క్లస్టర్ పరిధిలో నడిగూడెం, చాకిరాల, రామాపురం, ఎకలాస్‌ఖాన్‌పేట, శ్రీరంగాపురం, కరివిరాల క్లస్టర్ పరిధిలోని కరివిరాల, వెంకట్రాంపురం, చెన్నకేశ్వాపురం, బృందావనపురం, వేణుగోపాలపురం, కాగితరామచంద్రాపురం, సిరిపురం క్లస్టర్ పరిధిలో సిరిపురం, వల్లాపురం, నారాయణపురం, రత్నవరం క్లస్టర్ పరిధిలో రత్నవరం, తెల్లబెల్లి గ్రామాలున్నాయి. గత రెండేన్నర ఏళ్లుగా రైతు వేదికల నిర్వహణకు ప్రభుత్వం నిధులు విడుదల చేయకపోవడంతో నిర్వహణ కష్టంగా మారిందని పలువురు విస్తరణాధికారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సొంతంగా ఖర్చు చేసి రైతు వేదికలను నిర్వహించుకోవాల్సిన పరిస్థితి ఏర్పడిందని పలువురు ఏఈఓలు చెబుతున్నారు. రైతు వేదిక నిర్వహణకు 2022 ఆగస్టు వరకు నిధులు వచ్చేవి, ఆ తర్వాత నుంచి నిధులు మంజూరు కావడం లేదు. గతంలో ఒక్కో రైతు వేదిక నిర్వహణకు ప్రతి నెలా మూడు వేలు మంజూరు అయ్యేవని గత రెండున్నర ఏళ్లుగా మంజూరు కావడం లేదని ఏఈఓలు చెబుతున్నారు.

మందుబాబులకు అడ్డాగా..

నడిగూడెం రైతు వేదిక మందుబాబులకు అడ్డాగా మారింది. రైతు వేదిక చుట్టూ ప్రహరీ, గేటు లేకపోవడంతో మందుబాబులు అందులో నిత్యం మద్యం సేవిస్తున్నారు. అలాగే మరుగు దొడ్ల చుట్టూ కంప చెట్లు పెరిగాయి. మరుగుదొడ్ల తలుపులు చోరీకి గురయ్యాయి. కరివిరాల రైతు వేదికకు కూడా ఎలాంటి రక్షణ లేకపోవడంతో మందుబాబులు అడ్డాగా మార్చుకున్నారు. సిరిపురం, రత్నవరం గ్రామాలలోని రైతు వేదికలు కూడా అస్తవ్యస్తంగా మారాయి. ఈ నాలుగు రైతు వేదికలకు నీటి సౌకర్యం లేదు. గ్రామాలకు దూరంగా ఉండడంతో రైతులకు ఇబ్బందికరంగా మారింది. సంబంధిత అధికారులు స్పందించి రైతు వేదికల నిర్వహణకు నిధులు మంజూరు చేసి వాటి నిర్వహణను పట్టించుకోవాలని రైతులు కోరుతున్నారు.

రైతు వేదికలకు రక్షణ లేదు



నడిగూడెం, కరివిరాల, సిరిపురం రైతు వేదికలకు రక్షణ లేకుండా పోయింది. దీంతో మందుబాబులకు అడ్డాగా మారాయి. వాటి నిర్వహణ కూడా సంబంధిత అధికారులకు కష్టతరంగా మారింది. ప్రభుత్వం స్పందించి రైతు వేదికల నిర్వహణకు ప్రత్యేక సిబ్బందిని నియమించి, రక్షణ కల్పించాలి. అలాగే నిర్వహణకు నిధులు మంజూరు చేయాలి. సీజనల్‌గా రైతులకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలి.

– దుస్సా వెంకటేశ్వర్లు, రైతు, వల్లాపురం

రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకోవాలి

- ఆర్డీఓ శ్రీనివాసులు



గడ్డిపల్లిలో సిబ్బందిని వివరాలు అడిగి తెలుసుకుంటున్న ఆర్డీఓ శ్రీనివాసుల

గరిడేపల్లి : మండలంలో నిర్వహిస్తున్న భూ భారతి రెవెన్యూ సదస్సులను రైతులు సద్వినియోగం చేసుకోవాలని హుజూర్‌నగర్ ఆర్డీఓ శ్రీనివాసులు కోరారు. మంగళవారం మండల పరిధిలోని కాల్వపల్లి, గడ్డిపల్లి గ్రామాల్లో నిర్వహించిన రెవెన్యూ సదస్సులో ఆయన పాల్గొని మాట్లాడారు. రైతులు భూ సమస్యలపై ఈ సదస్సుల్లో దరఖాస్తు చేసుకుంటే పరిష్కరిస్తామని తెలిపారు. గ్రామసభల్లోనూ రైతులు తమ సమస్యలను దరఖాస్తు రూపంలో ఇవ్వాలని సూచించారు. రైతుల దరఖాస్తులు నింపే విషయంలో ఇబ్బందులు లేకుండా గ్రామసభ నిర్వహించే చోట సహాయక కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో డీపీఓ రాజేందర్‌రెడ్డి, తహసీల్దార్ కవిత, ఆర్‌ఐ రాంబాబు, గంటా సుధాకర్‌రెడ్డి సిబ్బంది పాల్గొన్నారు.

ఉపాధి హామీ పనుల పరిశీలన



ఆకుపాములలో ఉపాధి హామీ పనుల రికార్డులను పరిశీలిస్తున్న జెడ్పీ డిప్యూటీ సీఈఓ

మునగాల : ఉపాధి హామీ పనుల్లో పారదర్శకత పాటించాలని జెడ్పీ డిప్యూటీ సీఈఓ డి.శిరీష కోరారు. మంగళవారం మండలంలోని ఆకుపాములలో ఉపాధి హామీ పనుల్లో భాగంగా చేపడుతున్న వ్యవసాయ భూములకు వెళ్లే రోడ్డు నిర్మాణ పనులను ఆమె సందర్శించి కూలీల హాజరు నమోదు, తదితర రికార్డులను పరిశీలించారు. అనంతరం ఆకుపాముల, కోదండరామాపురం, ముకుందాపురం గ్రామాల్లో నర్సరీలను సందర్శించి ఖాళీ సంచుల్లో విత్తనాలు విత్తాలని ఆదేశించారు. అనంతరం ఆకుపాముల, ముకుందాపురం గ్రామపంచాయతీల్లో రికార్డులను పరిశీలించారు. ఆయా కార్యక్రమాల్లో ఎంపీడీఓ కె.రమేష్‌దీనదయాళ్, ఏపీఓ యూ.శైలజ, కార్యదర్శులు నాగరాజు, కవిత, రాజేష్, ఫీల్డ్ అసిస్టెంట్లు ముత్తయ్య, జానకి, సిబ్బంది పాల్గొన్నారు.

ఈదురుగాలుల బీభత్సం



మోతె : రేకులు పడడంతో ధ్వంసమైన ఆటో

మేళ్లచెరువు : మండలంలో మంగళవారం సాయంత్రం గాలివాన బీభత్సం సృష్టించింది. ఈదురు గాలులతో కూడిన భారీ వర్షం పడింది. గాలిదుమారానికి మేళ్లచెరువు మండల కేంద్రంలోని హుజూర్‌నగర్ రోడ్డులో డబ్బాకొట్టు, రేకులు రోడ్డుపై పడ్డాయి. దీంతో రోడ్డు గుండా వెళ్లే వాహనదారులు ఇబ్బందులు పడ్డారు. అదే విధంగా పలుచోట్ల చెట్లు విరిగాయి. విద్యుత్ తీగలు తెగిపడ్డాయి. సాయంత్రం నుంచి విద్యుత్ సరఫరా నిలిచిపోయింది.

ఇద్దరికి స్వల్ప గాయాలు

మోతె : మండలంలోని పలు గ్రామాల్లో మంగళవారం సాయంత్రం వీచిన ఈదురుగాలులకు మామిడి తోటల్లో మామిడి కాయలు నేలరాలాయి. ఉర్లుగొండ గ్రామంలోని శ్రీలక్ష్మీనర్సింహ వైన్స్ పైకప్పు రేకులు ఈదురు గాలులకు లేచి రోడ్డు పక్కన పడ్డాయి. దీంతో అక్కడ ఉన్న బైక్, ఆటో స్వల్పంగా ధ్వంసం అయ్యాయి. ఆటోలో ఉన్న వ్యక్తికి స్వల్ప గాయాలయ్యాయి. అక్కడే ఉన్న మరో వ్యక్తి కూడా గాయపడ్డట్లు స్థానికులు తెలిపారు.

కోర్టుల్లో వసతుల కల్పనకు కృషిచేయాలి



జిల్లా ప్రధాన న్యాయమూర్తిని సన్మానిస్తున్న బార్ అసోసియేషన్ సభ్యులు

హుజూర్‌నగర్ : అదనపు జూనియర్ సివిల్ జడ్జి కోర్టుల్లో మౌలిక వసతుల కల్పనకు కృషి చేయాలని హుజూర్‌నగర్ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు సాముల రామిరెడ్డి కోరారు. ఈమేరకు మంగళవారం హుజూర్‌నగర్ బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో న్యాయవాదులు సూర్యాపేట జిల్లా కేంద్రంలో జిల్లా ప్రధాన న్యాయమూర్తి లక్ష్మీ శారదను ఆమె చాంబర్‌లో మర్యాదపూర్వకంగా కలిసి కోరారు. ఈ సందర్భంగా న్యాయమూర్తిని శాలువాలతో ఘనంగా సత్కరించారు. నూతనంగా మంజూరైన రెండు అదనపు జూనియర్ సివిల్ జడ్జి కోర్టుల తాత్కాలిక భవనాల ఏర్పాటును పరిశీలించేందుకు హుజూర్‌నగర్ రావాలని జడ్జిని కోరారు. వారం రోజుల్లో తప్పనిసరిగా కోర్టును సందర్శిస్తానని వారికి హామీ ఇచ్చారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ కార్యదర్శి చనగాని యాదగిరి, ఉపాధ్యక్షుడు జక్కుల నాగేశ్వరరావు, ఏజీపీలు రేణుకాదేవి, సురేష్‌కుమార్, సంధ్య, మహిళా ప్రతినిధి కోలా రమాదేవి, న్యాయవాదులు కాల్వ శ్రీనివాసరావు, రవికుమార్, డి.శ్రీనివాసరావు, ఎ.శ్రీనివాస్ రెడ్డి, జి.ప్రశాంత్, నాగేష్, వీజీకేమూర్తి, రామలక్ష్మారెడ్డి, వెంకటేష్, రమేష్, ప్రవీణ్‌కుమార్ ఉన్నారు.

వారం రోజులలోగా పూర్తి వివరాలు అందించాలి

హుజూర్‌నగర్‌రూరల్ : మండలంలోని బూరుగడ్డ రెవెన్యూ పరిధిలో గల సర్వే నంబర్ 604లో సర్వేకు వచ్చిన అధికారులను సోమవారం గ్రామ రైతులు అడ్డుకున్న విషయం తెలిసిందే. కాగా మంగళవారం హుజూర్‌నగర్ తహసీల్దార్ నాగార్జునరెడ్డి, ఎస్‌ఐ ముత్తయ్య గ్రామానికి చెందిన రైతులతో మాట్లాడారు. ఈనెల 12వ తేదీ వరకు గడువు ఇస్తున్నామని ఈలోగా 604 సర్వే నంబర్‌లోని భూములకు సంబంధించి రైతులు వారి దగ్గర ఉన్న సరైన ఆధారాలు చూపించాలని సూచించారు. సరైన డాక్యుమెంట్ లేని పక్షంలో సర్వే కొనసాగిస్తామని తెలిపారు. వారి వెంట ఆర్‌ఐ షరీఫ్, జూనియర్ అసిస్టెంట్ శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

పంచాయతీ కార్యాలయం తనిఖీ

నడిగూడెం : మండలంలోని చెన్నకేశ్వాపురం గ్రామ పంచాయతీ కార్యాలయాన్ని మంగళవారం ఎంపీడీఓ దాసరి సంజీవయ్య ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కార్యాలయంలోని రికార్డులను పరిశీలించారు. గ్రామంలో పారిశుద్ధ్యం, తాగు నీటి సమస్యలు లేకుండా చూడాలని సిబ్బందికి సూచించారు. ఆయన వెంట పంచాయతీ కార్యదర్శి అన్వర్, ఫీల్డ్ అసిస్టెంట్ దార అంబేద్కర్ ఉన్నారు.

మేడే వారోత్సవాలు

మఠంపల్లి : మేడే స్ఫూర్తితో కార్మిక, కర్షక, ఐక్య ఉద్యమాలు నిర్వహించాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు భూక్యా పాండునాయక్ అన్నారు. మేడే వారోత్సవాల్లో భాగంగా మండలంలోని మట్టపల్లిలో మంగళవారం ఆయన ఎర్రజెండా ఎగురవేసి మాట్లాడారు. కార్యక్రమంలో సీపీఎం సీనియర్ నాయకులు శాగంరెడ్డి జగన్‌మోహన్‌రెడ్డి, మండల కార్యదర్శి మాళోతు బాలునాయక్, నాయకులు పాడిశెట్టి రాము, సైదానాయక్, లచ్చునాయక్, దాసు, నరసింహారావు, భాషా, ఎ.గోపాల్, ఖాజా, రామస్వామి, ఈశ్వరమ్మ, అలివేలు, చిట్టిమ్మ, లక్ష్మి, ఎస్. గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

మహాధర్నా కరపత్రం ఆవిష్కరణ



కరపత్రం ఆవిష్కరిస్తున్న శీలం శ్రీను, తదితరులు

మఠంపల్లి : రాష్ట్రంలోని మత్స్యకారులకు వృత్తి రక్షణ, ఉపాధి, జీవిత భద్రత కల్పించాలని మత్స్య కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి శీలం శ్రీను ప్రభుత్వాన్ని కోరారు. మత్స్యకారుల సమస్యలు పరిష్కరించాలని ఈనెల 15న హైదరాబాద్‌లోని ఇందిరా పార్క్ వద్ద నిర్వహించతలపెట్టిన మహాధర్నా కరపత్రాలను మంగళవారం ఆ సంఘం కార్మికులతో కలిసి మఠంపల్లిలో ఆవిష్కరించి మాట్లాడారు. కార్యక్రమంలో సంఘం జిల్లా సహాయ కార్యదర్శి పోషనబోయిన హుస్సేన్, నాయకులు సీహెచ్.రాములు, కె.రాములు, కె.నాగమణి, లక్ష్మి, వెంకటరమణ, సైదమ్మ, సైదులు, టి.నాగమణి, ఎస్.నాగమణి, సీహెచ్.లక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

పోషకాహారం తీసుకోవాలి



పోషకాహార కిట్లు పంపిణీ చేస్తున్న వైద్యాధికారి రంజిత్‌కుమార్

అనంతగిరి : మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మంగళవారం క్షయ వ్యాధిగ్రస్తులకు ప్రభుత్వం నుంచి వచ్చిన పోషకాహార కిట్లను వైద్యాధికారి రంజిత్‌కుమార్ అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. క్షయ వ్యాధిగ్రస్తులు క్రమం తప్పకుండా మందులు వాడి పౌష్టికాహారం తీసుకుంటే త్వరగా కోలుకుంటారని తెలిపారు. కార్యక్రమంలో హెచ్‌ఈఓ ఉపేందర్, టీబీ నోడల్ పర్సన్ ఉమామహేశ్వరి, హెల్త్ అసిస్టెంట్ మధుబాబు, ఏఎన్‌ఎం ఉమ, ఆశా వర్కర్లు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

క్షేత్రపాలకుడికి పంచామృతాభిషేకం

హుజూర్‌నగర్‌రూరల్ : మండలంలోని బూరుగడ్డలో గల శ్రీ ఆదివరాహ శ్రీవేణుగోపాల, లక్ష్మీనరసింహస్వామి దేవాలయంలో మంగళవారం క్షేత్రపాలకుడు శ్రీఆంజనేయస్వామికి పంచామృతాభిషేకం చేశారు. స్వామివారికి నాగవల్లీ దళాలతో అర్చన, ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ ఎరగాని గురువయ్య, ధర్మకర్తలు అంజయ్య, హరీష్‌కుమార్, నరసింహరావు, కృష్ణప్రసాద్, హనుమంతరావు, కవిత, ఈఓ ఎంపీ లక్ష్మణ్‌రావు, అర్చకులు హరీష్‌కుమారాచార్యులు, భక్తులు పాల్గొన్నారు.

అన్నదాన సత్రం అభివృద్ధికి సహకరించాలి

మఠంపల్లి : మండలంలోని మట్టపల్లి శ్రీలక్ష్మీనరసింహస్వామి క్షేత్రంలో గల శ్రీ మార్కండేయ పద్మశాలీ అన్నదాన సత్రం అభివృద్ధికి తెలుగు రాష్ట్రాలకు చెందిన కుల బంధువులు సహకరించాలని అన్నదాన సత్రం కమిటీ బాధ్యులు చిన్నం వీరమల్లు, పిండిప్రోలు రామచంద్రయ్య కోరారు. మంగళవారం మట్టపల్లిలోని అన్నదాన సత్రంలో నిర్వహించిన కమిటీ సమావేశంలో వారు మాట్లాడారు. ఈనెల 11, 12 తేదీల్లో జరిగే శ్రీస్వామి వారి తిరుకల్యాణ మహోత్సవాలకు వచ్చే భక్తులకు భోజన వసతికి ఏర్పాట్లు పూర్తి చేస్తున్నట్లు తెలిపారు. అదేవిధంగా ఈనెల 12న సత్రం నూతన కమిటీని ఎన్నుకోనున్నట్లు తెలిపారు. సమావేశంలో సంఘం నాయకులు అంకయ్య, కుమారస్వామి, అంజయ్య, లక్ష్మీనారాయణ, శ్రీనివాస్, కృష్ణారావు, నరసింహారావు, వెంకటసుబ్బయ్య, రామారావు, చినవెంకటేశ్వర్లు, కోటయ్య, రాజేంద్రప్రసాద్, బ్రహ్మం, రాంబాబు, తదితరులు పాల్గొన్నారు.

పాకిస్తానీయులను పంపించాలని వినతి

మునగాల : భారతదేశంలో అక్రమంగా నివసిస్తున్న పాకిస్తానీయులను వెంటనే వారి దేశం పంపించాలని బీజేపీ నాయకులు డిమాండ్ చేశారు. ఈమేరకు మంగళవారం మునగాల తహసీల్దార్ వి.ఆంజనేయులుకు వారు వినతిపత్రం అందజేసి మాట్లాడారు. పాకిస్తాన్ మద్దతుతో ఆశ్రయం పొందిన ఐఎస్‌ఐ ఉగ్రవాదులు పహల్గాంలో అమాయకపు ప్రజల ప్రాణాలను బలిగొన్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మండల పరిధిలో ఎవరైన పాకిస్తానీయులు నివాసం ఉంటే తక్షణమే గుర్తించి బహిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు మైలార్‌శెట్టి నాగేశ్వరరావు, సీనియర్ నాయకులు భద్రంరాజు కృష్ణప్రసాద్, పనస రమేష్, బి.కపిల్ రెడ్డి, షేక్ సైదా, సీహెచ్.గోవిందాచారి పాల్గొన్నారు.

వృద్ధాశ్రమంలో అన్నదానం

మునగాల : మండలంలోని ముకుందాపురం శివారులో గల ఇందిర అనాథ వృద్ధాశ్రమంలో మంగళవారం ఆర్యవైశ్య మహిళా సంఘం సూర్యాపేట జిల్లా అధ్యక్షురాలు గరిణె ఉమామహేశ్వరి -శ్రీధర్, ప్రధాన కార్యదర్శి ఓరుగంటి విజయలక్ష్మి -పాండు, కోశాధికారి ఆరేటి వెంకటలక్ష్మి- సాంబశివరావు ఆధ్వర్యంలో అన్నదానం చేశారు. మహిళా సంఘం సీనియర్ సభ్యురాలు ఊటుకూరి వెంకాయమ్మ వర్ధంతి సందర్భంగా వారి కుమారుడు వెంకటేశ్వరరావు సహకారంతో ఈ అన్నదానం వితరణ చేపట్టారు. వృద్ధాశ్రమం వ్యవస్థాపకురాలు నాగిరెడ్డి విజయమ్మ, జ్యోతి పాల్గొన్నారు.

దివ్యాంగుల కేంద్రంలో..

కోదాడరూరల్ : పట్టణ పరిధిలోని కొమరబండకు చెందిన మాజీ సర్పంచ్ సంపెట రవిగౌడ్- విజయలక్ష్మి దంపతుల వివాహ వార్షికోత్సవం సందర్భంగా మంగళవారం మండలంలోని అశోక్‌నగర్‌లో గల మా నసిక దివ్యాంగుల కేంద్రంలో, కొమరబండలోని చర్చిలో అన్నదానం చేశారు. దాతలు సంపెట రవిగౌడ్ విజయలక్ష్మి, ఉపేందర్, లక్ష్మీసంతోషి, సుధాశ్రీ, ప్రసాద్, అంజిరెడ్డి, సత్యనారాయణ, ఉన్నారు.

సీఎం వ్యాఖ్యలపై ఖండన

కోదాడరూరల్ : ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్ల పట్ల సీఎం రేవంత్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నట్లు పలువురు రిటైర్డు ఉద్యోగుల సంఘం నాయకులు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎన్నికల సమయంలో ఉద్యోగులు, పెన్షనర్లకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని వారు కోరారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు, ఉపాధ్యాయులు

నడిగూడెం : మండల కేంద్రంలోని సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాలలో 2006- 07 విద్యా సంవత్సరంలో పదవ తరగతి చదువుకున్న విద్యార్థులు మంగళవారం పాఠశాలలో ఆత్మీయ సమ్మేళనాన్ని ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా పాఠశాల జ్ఞాపకాలను నెమరవేసుకొని ఆనందంగా గడిపారు. అనంతరం నాటి ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ చింతలపాటి వాణి, ఉపాధ్యాయులు అరుణ, రమణమ్మ, అనురాధ, కరుణాకర్‌రెడ్డి, రాంబాబు, ఎస్ఎన్.మూర్తి, కోటయ్య, పూర్వ విద్యార్థులు త్రివేణి, కవిత, హరిప్రియ పాల్గొన్నారు.

నేటి నుంచి విద్యార్థులకు సమ్మర్ క్యాంపు

మునగాల : మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బుధవారం నుంచి ఈనెల 23 వరకు విద్యార్థులకు సమ్మర్ క్యాంపు నిర్వహించనున్నట్లు మండల విద్యాధికారి పిడతల వెంకటేశ్వర్లు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 8 గంటల నుంచి 11గంటల వరకు శిక్షణ ఉంటుందని తెలిపారు. ఏడవ తరగతి నుంచి తొమ్మిదవ తరగతి విద్యనభ్యసించే 100 మంది విద్యార్థులకు మాత్రమే ఈ క్యాంపు ఉంటుందని, విద్యార్థులు తమ పేరు నమోదు చేసుకోవాలని తెలిపారు. ఈ క్యాంపులో డ్యాన్స్, స్పోర్ట్స్, డ్రాయింగ్, స్పోకెన్ ఇంగ్లిష్ క్లాసులు నిర్వహించనున్నట్లు తెలిపారు. మండలంలోని పాఠశాలల విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని ఎంఈఓ కోరారు.

విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలి

అనంతగిరి : మండలంలోని గోండ్రియాల, అనంతగిరి గ్రామాల్లో గల జెడ్పీ ఉన్నత పాఠశాలల్లో విద్యాశాఖ ఆధ్వర్యంలో ఈనెల 7వ తేదీ నుంచి 15 రోజుల పాటు వేసవి శిక్షణ శిబిరాలు నిర్వహించనున్నట్లు మండల విద్యాధికారి తల్లాడ శ్రీనివాసరావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ శిక్షణ శిబిరంలో జనరల్ ఇంగ్లిష్, బేసిక్ గణితం, డ్రాయింగ్, డ్యాన్స్ మొదలైన వాటిపై శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

చింతలపాలెంలో..

హుజూర్‌నగర్ (చింతలపాలెం) : చింతలపాలెం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఈ నెల 7 నుంచి 23వ తేదీ వరకు సమ్మర్ క్యాంపు నిర్వహించనున్నట్లు ఎంఈఓ శ్రీనివాస్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ క్యాంప్‌లో స్పోకెన్ ఇంగ్లిష్, డ్రాయింగ్, క్రాఫ్ట్, డ్యాన్స్ వంటి అంశాలపై నిపుణులతో శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులతో పాటు ప్రైవేట్ పాఠశాలల నుంచి ప్రభుత్వ పాఠశాలలో చేరాలనుకునే విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

రాజ్యాంగ పరిరక్షణే కాంగ్రెస్ ధ్యేయం



మునగాల : తాడువాయిలో ర్యాలీ నిర్వహిస్తున్న కాంగ్రెస్ పార్టీ నాయకులు

మునగాల : రాజ్యాంగ పరిరక్షణే కాంగ్రెస్ పార్టీ ధ్యేయమని పలువురు కాంగ్రెస్ పార్టీ నాయకులు అన్నారు. జైబాపు, జైభీమ్, జైసంవిధాన్ కార్యక్రమంలో భాగంగా మంగళవారం మండలంలోని ఈదులవాగు తండా, నేలమర్రి, వెంకట్రాంపురం, తాడువాయి గ్రామాల్లో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కొప్పుల జైపాల్‌రెడ్డి ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా అధికార ప్రతినిధి మాతంగి బసవయ్య, కాంగ్రెస్ కిసాన్ సెల్ జిల్లా అధ్యక్షుడు బచ్చు అశోక్, బ్లాక్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కొలిశెట్టి బుచ్చిపాపయ్య, కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు కాసర్ల కోటేశ్వరరావు, యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు తొక్కల పాటి సాయి, కాంగ్రెస్ మండల ప్రధాన కార్యదర్శి జిల్లేపల్లి వెంకటేశ్వర్లు, వేనేపల్లి వీరబాబు, పనస విజయ్, ఈదారావు, నాగరాజు, సతీష్‌రెడ్డి, శంకర్, సైదులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కాంగ్రెస్ నాయకుల ర్యాలీ

అనంతగిరి : జైబాపు, జైభీమ్, జైసంవిధాన్ కార్యక్రమంలో భాగంగా మంగళవారం అనంతగిరి మండలంలోని బొజ్జగూడెం, అమీనాబాద్, మొగలాయి కోట, పాలారం గ్రామాల్లో కాంగ్రెస్ పార్టీ నాయకులు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా అమీనాబాద్‌లో పార్టీ మండల అధ్యక్షుడు ముస్కు శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో అంబేడ్కర్ విగ్రహం వద్ద నివాళులర్పించి ప్రతిజ్ఞ చేశారు. ఆయా కార్యక్రమా కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు కొండపల్లి వాసు, టీక్ర పుల్లారెడ్డి, బాబు నాయక్, శ్రీనివాసరావు, చుండూరి వెంకటేశ్వర్లు, డేగా కొండయ్య, రాము, రామకోటయ్య, ధరావత్ సైదులు, వీరబాబు, బాబు, వేణు, కోటేశ్వరరావు, జ్ఞానేందర్‌రెడ్డి, నాగేందర్‌రెడ్డి, నరేష్, విక్రమ్, చందర్‌రావు, నాగేశ్వరరావు, అశోక్, కార్యకర్తలు పాల్గొన్నారు.

వేసవి శిక్షణ శిబిరం ప్రారంభం



వాలీబాల్ క్రీడా శిక్షణ శిబిరాన్ని ప్రారంభిస్తున్న ఎంఈఓ సలీం షరీఫ్

కోదాడ : వేసవి శిక్షణ శిబిరాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోదాడ ఎంఈఓ సలీం షరీఫ్ కోరారు. వేసవి శిక్షణ శిబిరంలో భాగంగా మంగళవారం కోదాడ బాలుర పాఠశాలలో నిర్వహించే వాలీబాల్ క్రీడా శిక్షణను ఆయన ప్రారంభించి మాట్లాడారు. మార్కెండేయులు, మీనాక్షి, శ్రీనివాసరెడ్డి, పద్మావతి, ఖాజామియా, బడుగుల సైదులు, జూలూరి వీరభద్రం, శిక్షణ వలంటీర్లు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

మైనర్లకు వాహనాలు ఇవ్వొద్దు

నడిగూడెం : మైనర్లకు ద్విచక్ర వాహనాలు ఇవ్వవద్దని నడిగూడెం ఎస్‌ఐ జి.అజయ్‌కుమార్ మంగళవారం ఒక ప్రకటనలో సూచించారు. మైనర్లకు డ్రైవింగ్‌లో అవగాహన లేకపోవడంతో ప్రమాదాలకు గురయ్యే అవకాశముందని తెలిపారు. అదేవిధంగా ప్రస్తుత వేసవిలో రైతులు తమ పొలాల్లో వరి కొయ్యలకు నిప్పంటించవద్దని సూచించారు. వరి కొయ్యలకు నిప్పు పెడితే గ్రామాల్లో అగ్ని ప్రమాదాలు జరిగే ప్రమాదముందని తెలిపారు. అలాగే ప్రస్తుత వేసవిలో దొంగతనాలు జరిగే అవకాశముందని, గ్రామాల్లో గుర్తు తెలియని వ్యక్తులు సంచరిస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు.

గోశాలకు పశుగ్రాసం అందజేత

హుజూర్‌నగర్ : మట్టపల్లిలోని శ్రీ రాజ్యలక్ష్మి గోశాలకు మంగళవారం హుజూర్‌నగర్ మున్సిపల్ మాజీ కౌన్సిలర్ జక్కుల శంబయ్య ట్రాక్టర్ పశుగ్రాసాన్ని అందజేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు తన్నీరు మల్లికార్జున్‌రావు, మహిళా అధ్యక్షురాలు సప్పిడి సావిత్రి, మాజీ కౌన్సిలర్ ఓరుగంటి నాగేశ్వరరావు, అభయాంజనేయస్వామి ఆలయ చైర్మన్ పి.వెంకటేశ్వర్లు, నాయకులు కోడి ఉపేందర్, యోహాన్, క్రాంతి, సైదులు, సాయిరాం, గోపి, అనిల్, కిరణ్, జానీ తదితరులు పాల్గొన్నారు.

చికాగో అమరవీరుల స్ఫూర్తితో ఉద్యమిద్దాం

మునగాల : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై చికాగో అమరవీరుల స్ఫూర్తితో ఉద్యమిద్దామని సీపీఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ నాయకులు ధరావత్ రవి, పోటు లక్ష్మయ్య అన్నారు. సోమవారం రాత్రి మేడే వారోత్సవాల్లో భాగంగా మండలంలోని కొక్కిరేణిలో నిర్వహించిన కార్యక్రమంలో వారు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎర్రజెండా ఆవిష్కరించి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో సీపీఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ సీనియర్ నాయకులు ఎల్లావుల సైదులు, నాయకులు సైదా, వీరబోయిన బాలయ్య, ఎల్లావుల శివ, వట్టెపు కోటయ్య, పొన్నం బ్రహ్మం, కోటయ్య, కిట్టయ్య, వీరయ్య, శ్రీరాములు పాల్గొన్నారు.

మజ్జిగ, పులిహోర పంపిణీ

నేరేడుచర్ల : పట్టణంలో వాసవి, వనిత క్లబ్‌ల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రంలో మంగళవారం వ్యాపారవేత్త పాలిశెట్టి వినయ్ -ధనలక్ష్మి కుమారుడు మనిష్ జన్మదినం సందర్భంగా మజ్జిగ, పులిహోర పంపిణీ చేశారు. కార్యక్రమంలో వాసవి క్లబ్ డిస్ట్రిక్ చైర్మన్ కొత్త లక్ష్మణ్, పారాయణం జిల్లా చైర్మన్ కందిబండ వాసంతి, పండుగలు, సంప్రదాయాల జిల్లా చైర్మన్ వీరవెల్లి శ్రీలత, లక్ష్మీనర్సింహారావు, లక్ష్మీనారాయణ, జ్యోతి, రేపాల ఉర్మిల, మదు, అంజయ్య, సైదయ్య, తదితరులు ఉన్నారు.

లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో అల్పాహారం..

నేరేడుచర్ల : పట్టణంలో నిరుపేదలకు మంగళవారం నిమ్మల పాండురంగారావు సహకారంతో నేరేడుచర్ల లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో అల్పాహారం అందజేశారు. క్లబ్ అధ్యక్షుడు జిలక రామస్వామి, జోన్ చైర్మన్ చల్లా ప్రభాకర్‌రెడ్డి, డిస్ట్రిక్ చైర్మన్ బట్టు మధు, యడవల్లి సత్యనారాయణరెడ్డి, గుండ్రెడ్డి సైదిరెడ్డి, యూసుఫ్, చింతకుంట్ల పూర్ణచందర్ రావు, కీత కనకయ్య, లక్ష్మారెడ్డి, చిలకరాజు శ్రీను, విశ్వనాథం, నాగార్జున, తదితరులు ఉన్నారు.

సిబిల్ స్కోర్ తప్పనిసరి అనడం తగదు

నడిగూడెం : రాజీవ్ యువ వికాసం పథకం అమలుకు రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సిబిల్ స్కోర్ తప్పనిసరి అనడం సరికాదని బహుజన స్టూడెంట్ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వెంపటి సైదులు అన్నారు. మంగళవారం నడిగూడెంలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. వందల కోట్ల రూపాయలు ఎగ్గొడుతున్న పారిశ్రామికులకు, బడా బాబులకు, కాంట్రాక్టర్లకు లేని సిబిల్ స్కోర్ గ్రామీణ యువతకు పెట్టడం సరికాదన్నారు.